క్లుప్తంగా

శ్రీ భ్రమరాంబిక అమ్మవారి దేవాలయంలో పూజలు

దుండిగల్: భారతదేశ 75 సంవత్సరాల స్వతంత్ర అమృతోత్సవాల ముగింపు సందర్భంగా బీజేపీ నేతలు 'నా మట్టి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. దుండిగల్ మున్సిపాలిటీ భౌరంపేటలోని శ్రీభ్రమరాంబిక అమ్మవారి దేవాలయంలో పూజలు నిర్వహించి మట్టి సేకరించారు. మున్సిపాలిటీ అధ్యక్షుడు ఆనబోయిన మల్లేశ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బిజేపి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

దుండిగల్: తమ కళాశాలలో విద్యనభ్యసించిన వేలాది మంది విద్యార్థులు ఉన్నతమైన ఉద్యోగాల్లో స్థిరపడడం సంతృప్తి కలిగిస్తుందని ఎంఎల్ఆర్ఐటీ విద్యా సంస్థల కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఎంఎల్ఆర్ ఫార్మసీ కళాశాలలో శనివారం సంయుక్తంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమకు అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, కోశాధికారి మర్రి మమతారెడ్డి పాల్గొన్నారు.

అదుపు తప్పిన లారీ



సుభాష్‌నగర్: బియ్యం లోడుతో వెళ్తున్న ఓ లారీ అదుపు తప్పిన ఘటన సూరారం కట్టమైసమ్మ ఆలయం సమీపంలో చోటు చేసుకుంది.. శనివారం ఉదయం నర్సాపూర్ నుండి బాలానగర్ వైపు బియ్యం లోడుతో వెళ్తున్న లారీ ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఓ వైపుకు ఒరిగింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు కాగా స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

డీసీఎం వాహనంలో మంటలు



కుత్బుల్లాపూర్: డీసీఎం వాహనంలో మంటలు చెలరేగిన ఘటన దూలపల్లిలోని చర్మాస్ కంపెనీ సమీపంలో చోటు చేసుకుంది.. శనివారం ఉదయం లోడుతో వచ్చిన డీసీఎం వాహనంలో చర్మాస్ కంపెనీ రోడ్డు వద్దకు రాగానే షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. దీంతో అప్రమత్తమైన డీసీఎం డ్రైవర్ వెంటనే వాహనాన్ని పక్కకు నిలిపి స్థానికుల సహాయంతో మంటలను ఆర్పాడు.

అనుమానాస్పద స్థితిలో మహిళ అదృశ్యం



దివ్య (ఫైల్)

కుత్బుల్లాపూర్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ అదృశ్యమైన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ తిరుమలగిరి ప్రాంతానికి చెందిన దివ్య(29) సుచిత్రలోని శ్రీరామ్‌గార్డెన్ అపార్ట్‌మెంట్స్‌లో హౌస్ కీపింగ్ ఉద్యోగం చేస్తోంది. ఈ నెల 30న ఉదయం 10 గంటలకు దివ్యను ఆమె భర్త రాజేందర్‌కుమార్ బైక్‌పై అపార్ట్‌మెంట్ వద్ద దింపి వెళ్లిపోయాడు. అదే రోజు సాయంత్రం సదరు ఏజెన్సీ నిర్వాహకుడు రాజేందర్‌కుమార్‌కు ఫోన్ చేసి దివ్య మధ్యాహ్నం నుండి పనికి రాలేదని పేర్కొన్నాడు. దీంతో ఆందోళన చెందిన భర్త వెంటనే ఆమె మొబైల్‌కు ప్రయత్నించగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దివ్య జాడ కోసం చుట్టు పక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకుండాపోయింది. శనివారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని సిక్కుల బస్తీలో డ్రైనేజీ సమస్యతో బస్తీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు శనివారం స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి నూతన పైపులైన్ పనులను ప్రారంభించారు. డ్రైనేజీ పనులను నాణ్యతా ప్రమాణాలతో, త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావలని సూచించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ అనిల్ కుమార్, బస్తీ అధ్యక్షుడు అమర్‌సింగ్ పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల పంపిణీలో రాజకీయ జోక్యం లేదు

– మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



పోలీసులతో వాగ్వావాదానికి దిగిన దరఖాస్తుదారులు



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాధవరం కష్టారావు, హైదరాబాద్ కలెక్టర్ ఆమోయ్ కుమార్

సుభాష్‌గనర్: సీఎం కేసీఆర్ ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజల కోసం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. డబుల్ ఇళ్ల మొదటి విడత పంపిణీకి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్ పల్లి వేదికైంది. శనివారం జరిగిన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, సనత్ నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల చెందిన 1700 మంది లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీకి శ్రీకారం చుట్టారు. డబల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, హైదరాబాద్ కలెక్టర్ అమోయ్ కుమార్‌లతో కలిసి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..కేసీఆర్ ప్రభుత్వం పేద మధ్య తరగతి ప్రజల కోసం దేశ చరిత్రలో మొదటిసారిగా నగరంలో పదివేల కోట్లతో లక్ష డబల్ బెడ్ రూమ్ కట్టాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటికే 69,532 కట్టించిందన్నారు. మొదటి విడతగా నగరంలో 11,700 ఇళ్లను పంపిణీ చేసిందని, మిగతా 58 వేల ఇళ్లను విడతలవారీగా 12 వేల చొప్పున ఆరుసార్లు పంపిణీ చేస్తుందని తెలిపారు. మొదటి విడతలో రానివారికి మిగతా విడుతలో వస్తుందని అందోళన చెందవద్దని సూచించారు.

గందరగోళం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కష్టారావు ప్రసంగిస్తున్న సమయంలో కొంతమంది మహిళలు ఆందోళనకు దిగారు. దీంతో ఐదు నిమిషాల పాటు గందరగోళ పరిస్థితి నెలకొంది.

మాజీ ఎమ్మెల్యే కూనను అదుపులోకి...

డబల్ బెడ్ రూమ్ పంపిణీ వేదిక వద్దక నిరసన చేసేందుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ వెంకట్ రెడ్డి అడ్డుకున్నారు. స్థానికంగా వేల సంఖ్యలో దరఖాస్తులు రాగా కేవలం 500 మాత్రమే పంపిణీ చేయడం ఏమిటని కూన ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ, సీపీఎం నాయకులు కీలుకాని లక్ష్మణ్, ఉమా మహేష్‌లు ఆందోళనకు దిగగా వారిని అరెస్టు చేసి పిఎస్‌కు తరలించారు.

సొంతింటి కల నెరవేరింది



నగరంలో సొంతింటిలో ఉంటాం అనుకోలేదు. కేసీఆర్ వల్ల మాకు సొంతిల్లు వచ్చింది. ప్రతినెలా కట్టే అద్దె రూ.6000 మిగిలినట్టే. ఇక సంతోషంగా జీవితం గడుపుతాం.

– గంగా లక్ష్మి, గాజులరామారం.

ధైర్యం వచ్చింది



భర్త చనిపోయాడు. కూలినాలి చేస్తూ పిల్లలను చదివిస్తున్నా. చేసిన కష్టంలో సగం మేర ఇంటి అద్దెకే పోయేది. ఇకనుండి ఆ దిగులు లేదు. కెసిఆర్ రుణం తీర్చుకుంటా.

– కుమారి, సుభాష్ నగర్.



హాజరైన లబ్ధిదారులు



ఆందోళన చేస్తున్న దరఖాస్తుదారులు

ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత



ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్: ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్‌లోని శ్రీ రాజరాజేశ్వరి పోచమ్మ ఆలమ్మవార్ల విగ్రహ ప్రతిష్టాపన, బోనాల జాతరను ఆది, సోమవారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీని కలిసి ఆహ్వానించారు.

- గాజులరామారం డివిజన్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన శ్రీనవశక్తి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ స్థానికంగా అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని సూచించారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు విజయ్‌రామిరెడి, వార్డు మెంబర్ అజయ్‌గుప్తా, కమిటీ అధ్యక్షుడు మజీద్, ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి హరీష్ తదితరులు ఉన్నారు.

తొమ్మిదేళ్లుగా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం



నిరసన దీక్షలో పాల్గొన్న టీపీసీసీ ప్రతినిధి హన్మంతరెడ్డి

నిజాంపేట్: బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లగా నిరుద్యోగులను తీవ్ర అన్యాయం చేస్తూ వస్తోందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శవారం బాచుపల్లి చౌరస్తాలో ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు నవీన్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు రాష్ట్ర ప్రభుత్వం భర్తీచేయకుండా జాప్యం చేస్తోందని, దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ వేసి ఉద్యోగాలను భర్తీ చేసినట్లయితే నిరుద్యోగులకు ఉపాధితో పాటు విద్యార్థుల సమస్య తీరుతుందన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, గోపాల్ రావు, గణేష్, అరుణ్ తదితరులు నిరసనలో పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్, గొడుగుల పంపిణీ



విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తున్న కూన శ్రీనివాస్‌గౌడ్

చింతల్: విద్యార్థులు కష్టపడి చదివి తమ తల్లిదండ్రులకి, గురువులకు మంచి పేరు తేవాలని బీజేపీ నాయకుడు, కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ పరిధిలోని పలు పాఠశాలల్లో పర్యటించారు. కెకెఎం ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా సూరారం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో కూన శ్రీనివాస్ గౌడ్ సుమారు 1000 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, గడియారాలు, గొడుగులతో కూడిన పలు కిట్లను పంపిణీ చేశారు. గతంలో అనేక మంది పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశామని అన్నారు. డివిజన్ అధ్యక్షులు దుర్యోధన్ రావ్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల గ్రామంలోని శ్రీనల్లపోచమ్మ ఆలయం వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జీడిమెట్ల గ్రామానికి చెందిన తునికి కృష్ణారావు కుటుంబం సభ్యులు అమ్మవారికి వెండి కిరీటం బహుకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో హోమం అనంతరం అమ్మవారికి బోనాల సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహారెడ్డి, గౌరిగే బలప్ప, శ్రావణ్ కుమార్, వినయ్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

అమరులను స్మరించుకుందాం



అమరులైన సైనికుల స్థూపానికి మట్టి సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు..

కుత్బుల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న సైనిక అమర వీరుల స్థూపానికి మట్టిని పంపే అవకాశం రావడం సంతోషంగా ఉందని బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. శనివారం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ వద్ద మట్టిని సేకరించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా భరతసింహారెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం స్థూపాన్ని నిర్మించడానికి పూనుకుందన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో పాలు పంచుకోవడం గౌరవంగా భావిస్తానన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరి వర్ధన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పులి బలరామ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డులకు ఇద్దరు ఉపాధ్యాయుల ఎంపిక

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోకవర్గంలోని రెండు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. కుత్బుల్లాపూర్ మండలంలోని గురుమూర్తినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిహెచ్ సుదర్శన్, బాచుపల్లి మండలం నిజాంపేట్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నా జోషి పాండురంగ మూర్తిలు ఇద్దరు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు.

చాలా సంతోషంగా ఉంది



1988లో మహేశ్వరం మండలం డబీల్ గూడలోని పాఠశాలలో మొట్టమొదటగా ఉపాధ్యాయుడిగా చేరాను. ప్రస్తుతం కుత్బుల్లాపూర్ మండలం గురుమూర్తినగర్‌లో 2015 నుంచి జిహెచ్ఎంగా విధాలు నిర్వహిస్తున్నాను. విద్యార్థులకు చదువుతో పాటు అన్ని రంగాల్లో తీర్చి దిద్దేందుకు కృషి చేశాను.

– సిహెచ్.సుదర్శన్.

బాధ్యత మరింత పెరిగింది



1995లో జూన్20న బషీరాబాద్ మండలం మసాన్ పల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటిగా భాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేశాను. 2015 నుంచి బాచుపల్లి మండలం నిజాంపేట్ ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాను. 2021లో నా సేవలకు గురుబ్రాహ్మ నేషనల్ బెస్ట్ టిచర్ అవార్డు వచ్చిందన్నారు.విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాను.

– జోషి పాండురంగ మూర్తి.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



నిజాంపేట్: బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి స్కూల్‌లో శనివారం ఓపెన్ ఇంటర్ స్కూల్స్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌లో ప్రగతి సెంట్రల్ స్కూల్, ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్, సూర్య గ్లోబల్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ఎపిస్టిమో గ్లోబల్, వెండి ఓక్, మెరిడియన్, నారాయణ, విస్టా ఇంటర్నేషనల్, సదన, రెయిన్‌బో ఇంటర్నేషనల్ తదితర 18 స్కూళ్లకు సంబంధించిన జట్లు పోటీ పడనున్నాయి. టోర్నమెంట్‌ను పాఠశాల డైరెక్టర్ కొడాలి విజయ రాణి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఉత్సాహంగా లైవ్‌వెల్ మారథాన్



కూకట్‌పల్లి: హైదర్‌నగర్‌లో చిన్నారులు తల్లిదండ్రులతో కలిసి లైవ్‌వెల్ మారథాన్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రస్తుత జీవితంలో చిన్నపిల్లల్లో వస్తున్న మానసిక రుగ్మతలను పారద్రోలేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతి వంద మందిలో పదిమందికి పైగా చిన్నారులు వివిధ మాన సిక రుగ్మతలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారు కూడా సమాజంలో మంచి జీవితం గడిపేందు కు వైద్యులు, తల్లిదండ్రులు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. చిన్నారులు, తల్లిదండ్రులు లైవ్‌వెల్ రిహాబిలేషన్ నెట్‌వర్కు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

జీడిమెట్ల: నిషేదిత గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని జీడిమెట్ల పోలీసులు పట్టుకుని అతని వద్ద నుండి 900గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపిన మేరకు.. షాపూర్‌నగర్ సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన రమేష్ చంద్ర శర్మ(39) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించేందుకు రమేష్ దూల్‌పేట్ నుండి గంజాయి తీసుకువచ్చి కుత్బుల్లాపూర్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి షాపూర్‌నగర్‌లోని న్యూసాగర్ హోటల్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నాడని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు రమేష్ వద్ద ఉన్న ప్లాస్టిక్ బ్యాగు సోదా చేయగా అందులో 20 గ్రాముల గంజాయి ప్యాకెట్‌లు 45లభ్యమయ్యాయి. వాటిని రమేష్ దూల్‌పేట్‌లో ఒక్క ప్యాకెట్ రూ.500 లకు తీసుకు వచ్చి కుత్బుల్లాపూర్‌లో రూ.800కు విక్రయిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో ఒప్పుకున్నాడు. రమేష్‌పై కేసు నమోదు చేసి శనివారం రిమాండుకు తరలించారు.

గురువందనం - ఛాత్రాభినందనం...



కూకట్‌పల్లి: భారత వికాస్ పరిషత్ తెలంగాణ ప్రాంతం ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని పిఎస్ఎం స్కూలులోని ఇందిరా చంద్ర శేఖర్ ఆడిటోరియంలో శనివారం గురువందనం – ఛాత్రాభినందనం కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భారతవికాస్ పరిషత్ తెలంగాణ ప్రాంతంలోని 18 శాఖలచే ఎంపికచేయబడిన విశేష కృషి చేసిన ఉత్తమ గురువులకు, ఉత్తమ శిష్యులకు అభినందన కార్యక్రమం, రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో సత్కరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ లాంటి ఉత్తమ శిష్యులను తీర్చిదిద్దిన బ్రహ్మశ్రీ వేలేటి మృత్యుంజయ శర్మ, చిత్రలేఖన గురువులు మరగంటి కులశేఖరాచార్యులు, అవధాన రంగంలో విశేష కృషి చేస్తున్న మారుమాముల దత్తాత్రేయ శర్మ, యోగా శిక్షకులు బండి ఉష, లలిత సంగీత గురువులు బి. ఉదయకుమార్‌లను సత్కరించారు. కార్యక్రమంలో అశ్విని అధినేత సుబ్బారావు, వివేకానందన సేవా సమితి చైర్మన్ హనుమంతరావు పాల్గొన్నారు.



మహానేతకు ఘన నివాళి



షాపూర్‌నగర్ చౌరస్తా వద్ద ..



జగద్గిరిగుట్టలో..



గాజులరామారంలో అన్నదానం..



ప్రగతినగర్‌లో..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పలువురు కొనియాడారు. శనివారం వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజవకర్గ వ్యాప్తంగా వైఎస్సార్ అభిమానులు, కాంగ్రెస్, వైఎస్సార్‌టీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. – రంగారెడ్డినగర్